

పనులు చేపట్టకపోవడంతో నిర్మానుష్యంగా ఉన్న మేడిగడ్డ బరాజ్ ప్రాంతం

## మేడిగడ్డ పనుల్లో కానరాని పురోగతి

**మూడునెలలైనా పూర్తికాని టెస్టింగ్ • బరాజ్ వద్ద కనిపించని ఏజెన్సీల నిపుణులు**

**సర్కారే తాత్సారం చేస్తున్నట్టు అనుమానం!**

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 25 (నమస్తేతెలంగాణ)/మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. అక్టోబర్‌లో బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో 20వ పియర్ కుంగిన ఘటనపై మూడు నెలలుగా విచారణ కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటికే నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు, రాష్ట్ర డ్యాం సేఫ్టీ అధికారులు, విజిలెన్స్ అధికారుల బృందం మేడిగడ్డను పరిశీలించింది. పియర్స్ కుంగడంపై కారణాలు తెలుసుకునేందుకు ఇన్వెస్టిగేషన్ పనులు డైనోసార్, హట్సన్ ఏజెన్సీలకు అప్పగించింది. అయితే మూడు నెలలుగా ఇన్వెస్టిగేషన్ పనులు మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. బరాజ్ వద్ద పనుల్లో ఎలాంటి చొరవ కనిపించడం లేదు. పియర్స్ వద్ద సీరియస్‌గా పనులు చేపట్టి కారణాలు తెలుసుకునే ప్రక్రియ ఇంతవరకు జరుగడం లేదు. గురువారం బరాజ్ వద్ద పనులు జరుగుతున్న దాఖలాలు కనిపించలేదు. 19, 20, 21వ పియర్స్‌తోపాటు మిగిలిన పియర్స్ వద్దకు ఇసుకతో రోడ్లు వేశారు. ఏడో బ్లాకు వద్ద ఇసుక కుప్పలు పోశారు. లారీలు ఎక్కడికక్కడే నిలిచిపోయి ఉన్నాయి. బరాజ్ వద్ద ఎలాంటి ఏజెన్సీల నిపుణులు, సిబ్బంది లేక నిర్మానుష్య వాతావరణం కన్పించింది. బరాజ్ కుంగడంపై కారణాలు తెలుసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్టు కనిపించడం లేదు. విజిలెన్స్ అధికారులతో రోజుకో లీకులు ఇస్తూ కాలయాపన చేస్తూ బరాజ్ పనులను మొత్తానికే పక్కన పెట్టే కుట్ర జరుగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పియర్స్ కుంగడంపై అధ్యయనం చేసి పునరుద్ధరణ పనులు సిఫార్సు చేసేందుకు కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఏబీ పాండ్యా నేతృత్వంలో ఎనిమిది మందితో కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనను నీటి పారుదలశాఖ ప్రభుత్వానికి పంపింది. అధ్యయన కమిటీ బరాజ్ వద్ద పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి పియర్స్ కుంగడంపై కారణాలు అన్వేషించి పునరుద్ధరణకు సూచనలు ఇవ్వనుంది. దీంతో మరమ్మతు పనులు వేగవంతమయ్యే అవకాశం ఉన్నది. కాగా ఇంజినీరింగ్ అధికారులు అధ్యయన కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నారు. ఏదిఏమైనా పియర్స్ కుంగడంపై కారణాలు అన్వేషించి త్వరితగతిన పనులు చేపట్టాలని, వర్షాకాలం ప్రారంభమైతే బరాజ్‌లోకి భారీగా నీరు చేరి తీవ్ర నష్టం జరుగుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## వీగిన 'జమ్మికుంట' మున్సిపల్ అవిశ్వాసం

**• కౌన్సిలర్ల మధ్య చిచ్చుపెట్టిన కాంగ్రెస్! • కోరం లేక వీగిన తీర్మానం**

జమ్మికుంట, జనవరి 25: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావును పదవి నుంచి దింపాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదు. చైర్మన్‌పై 23వ వార్డు కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో పెట్టిన అవిశ్వాసం ఎట్టకేలకు వీగిపోయింది. గురువారం మున్సిపల్ కార్యాలయానికి ప్రత్యేకాధికారి, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ చేరుకున్నారు. షెడ్యూల్ సమయం ఉదయం 10 గంటలలోపు చైర్మన్ రాజేశ్వర్‌రావుకు 14మంది, అవిశ్వాస తీర్మానం పెట్టిన పొనగంటి మల్లయ్య వర్గంలో ఉన్న 16మంది కౌన్సిలర్లు హాజరవుతారని అందరూ భావించారు. కానీ, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 10.20 గంటలకు కేవలం పదో వార్డు కౌన్సిలర్ పొనగంటి విజయలక్ష్మి ఒక్కరే హాజరయ్యారు. ఆ తర్వాత ప్రత్యేకాధికారి అవిశ్వాస పరీక్షను మధ్యాహ్నం ఒంటి గంటకు వాయిదా వేశారు. అప్పటికి కూడా ఇరువర్గాలకు చెందిన కౌన్సిల్ సభ్యులెవరూ హాజరుకాలేదు. మధ్యాహ్నం 1.30గంటల తర్వాత ప్రత్యేకాధికారి మహేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. కోరం లేదనందున అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు. కాగా ఇద్దరు మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జి, తదితర హేమాహేమీలు ఎంతో ఆరాటంతో చైర్మన్ గిరిని తమ ఖాతాలో వేసుకోబోయి బోల్తా పడ్డారు. కౌన్సిలర్ల మధ్య చిచ్చుపెట్టిన కాంగ్రెస్‌కు చుక్కెదురైంది. కుట్రలను ఛేదించి బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ స్థానాన్ని నిలబెట్టుకొన్నది. ఆ తరువాత జమ్మికుంటకు వచ్చిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు. అవిశ్వాసాల పేరిట జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌ను ఇబ్బంది పెడితే తాము తిప్పికొట్టినట్టు తెలిపారు.

## దర్శనం టికెట్లు ఉంటేనే వసతి గదులు : టీటీడీ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): తిరుమల కొండపై వసతి గదులకు సంబంధించి టీటీడీ కీలక నిర్ణయం తీసుకొన్నది. ఏప్రిల్ నెల శ్రీవారి దర్శన టికెట్లు పొందిన భక్తులకు మాత్రమే మొదటిసారిగా వసతి గదుల కేటాయింపును ఆన్‌లైన్‌లో చేపట్టింది. దీంతో భక్తుల రద్దీని కొంతమేర తగ్గించొచ్చని టీటీడీ భావిస్తున్నది. శ్రీవారి ఆర్జిత సేవలు, లక్కీడిప్, వృద్ధులు, దివ్యాంగులు, శ్రీవాణి ట్రస్టు, రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లను టీటీడీ ఈ నెల 18 నుంచి 24 వరకు జారీ చేసింది. ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను భక్తులు 2గంటల 45 నిమిషాల్లోనే కొనుగోలుచేశారు.











